# దొంగతాత

సూరన్న తాతకి మల్లేనేవున్నాడా తలగుడ్డ మనిషి. కాని, ఆ తాతయ్యా వూరెందుకు వస్తాడు లెమ్మని తల తిప్పుకున్నాడు రాముడు. వరండాలో "ఆరోగ్య చింతామణి" నాటకం జరుగుతూంది. చివరి రంగంలో అనారోగ్య చక్రవర్తి, ఆరోగ్య చక్రవర్తిచే ఓడింపబడ్డాడు. ప్రజలంతా ఆరోగ్యవంతులుగా కేరింతాలు కొడుతున్నారు. తెరగా కట్టిన శాలువా వాలింది. అందరితో పాటు రాముడూ తప్పట్లు కొడుతున్నాడు. కాని శబ్దం రావడంలేదు. అతని చేతులంత చురుకుగా పనిచెయ్యడంలేదు. ఎదురుగా వాలివున్న ఎర్రశాలువా మీద అతని కేవో బొమ్మలాడుతున్నట్లు కనిపిస్తూంది.

హెడ్ మాస్టర్ గారు ఆ తెరముందు నిలచి ఏదో చెబుతున్నారు. కాని, రాముడదేమీ వినడం లేదు. తెరమీద తన క్కనిపిస్తున్న బొమ్మల్ని గుర్తుపడుతున్నాడు. అదుగో- ఆ ఎడమవైపు బొమ్మకి పెద్ద తలగుడ్డవుంది. వెనక్కాల మూరెడు చెంగు వేలాడుతూంది కూడాను. అది సూరన్న తాత బొమ్మే. అవును - చేతులోవున్న ఆ పొట్లం ఖర్జూరకాయలే అయివుంటయ్. తనకోసమే తెచ్చివుంటాడు. కాని, ఆకుడివైపునున్న బొమ్మ వెండిపొన్నుగర్రను అడ్డాంపెట్టిసూరన్న తాతని వెనక్కి తోలుతూంది ఎవరది? ఇంకెవరు— వెంకయ్యతాతే! ఆ పొన్నుగర్రా; ఆ పెద్ద బొజ్జా బుగ్గమీసాలూ; మెరిసే అంచుల కండువా; పచ్చని జంపూ యింకెవరికుంటాయ్? తన పుట్టినప్పట్నుంచీ తన వెంకయ్యతాత తప్ప మరెవరూ అవన్నీ కలవారు కనిపించలేదు.

అయితే—వెంకయ్యతాత, సూరన్న తాతని వెనక్కి తోలటం ఎందుకు? అరరె...సూరన్న తాత తెరమీదనుంచి వెళ్లిపోయాడే! ఎక్కడికో? కళ్ళు నులుముకుని లేచినుంచుని మరీ చూచాడు తెరని. ఆ తెరమీద యిపుడేమీ లేదు— ఎర్రశాలువా రెపరెపలాడుతూంది. హెడ్ మాస్టరు ఏదో చెబుతూనే వున్నాడు. రాముడుమాత్రం అదేమీ వినకుండా చుట్టూ వెదుకుతున్నాడు. ఈ తెరమీద యిలా తాతలబొమ్మలు ఎందుక్కనిపించాయో, రాముడు కర్థంకాలేదు. కాస్సేపు తన తాతలు నిజంగా అక్కడేదన్నా నాటక మాడిపోయారేమోనని అనుమానం కూడా పడ్డాడు. కాని మరుక్షణంలోనే వెంకయ్యతాత వూళ్లో లేడని గుర్తుకొచ్చింది. ఒకవేళ పగటికలలంటే యిలాటివేమో ననుకున్నాడు. ఎందుకనంటే—ఒక్కొసారి ఏదన్నా జరుగుతున్నప్పుడు, తను లోగడయిలా జరిగినట్లే కలలుకన్నానని రాముడుకు గుర్తొచ్చేది. ఇప్పుడీ తెరమీది బొమ్మలు కూడా, తను ఎపుడో చూచినట్లే యిపుడూ చేశాయ్. ఎంతకాలంనుంచో తను చూడని సూరన్న తాత యివ్వాళిట్లా ఎందుకు గుర్తొచ్చాడా అని రాముడాలోచించాడు. ఒకవేళ తానంతకుముందు అనుమానించినట్లు ఆ పదిమందిలోనూ కూచున్న తలపాగ మనిషి సూరన్న తాతేమోననీ; ఆయన్ని చూసినాకే యీ ఆలోచనలన్నీ వచ్చాయేమోననీ రాముడనుకోలేదు. ఎనిమిదేళ్ళ రాముడికి అంత ఆలోచనెక్కడిదీ?

కాని; అతని అజ్ఞాత మనస్సులో సూరన్న తాత తిరగడం మానలేదు అందుకనేయిందాకటి తలగుడ్డ మనిషిని పరీక్షించి అనుమానం తీర్చుకోవాలని చుట్టూ వెదుకుతున్నాడు. అదుగో – ఆచివరి బెంచీలో అయిదుగురి మధ్యా కూర్చున్న ఆముసలాయన సూరన్న తాతలాగానే వున్నాడు. తనవైపే చూస్తున్నాడే... ఆఁ...!

అంతకుముందు హెడ్ మాస్టరు తనను వేసిన అయిదు కేకలూ వినిపించలేదు రాముడికి. తను తాతను గుర్తుపడుతూండగా హెడ్ మాష్టరువచ్చి రెక్కపట్టుకుని బరబరా లాక్కుపోయి డ్రాయింగుమాష్టారి గదిలో తోసి "తొందరగా ఏడవ్వోయ్ - నెక్స్టు నువ్వే"నంటూ వెళ్ళిపోయాడు. డ్రాయింగు మాష్టరు మొఖం నిండా పౌడరు వేసి గుడ్డలు విప్పేవరకూ రాముడు అయోమయంగా వున్నాడు. డ్రాయింగు మాష్టరు పట్టుగుడ్డలుకట్టి; పూసలదండలు వేసి; చెక్కకత్తి భుజాన పెట్టి గదిబయటకు నెట్టేసరికి— తను ప్రహ్లాదనాటకంలో సైనికుని వేషం వేసి, నటించబోతున్నట్లు గుర్తొచ్చింది. చరచరా వెళ్లి తెరవెనుక మందలో కలిశాడు.

* * *

నాటకంలో తన వేషం ప్రహ్లాదుణ్ణి కొట్టమన్నప్పుడల్లా, కొట్టడం, తొయ్యడం తప్పమరేమీ చెయ్యాదు. "చిత్తం చిత్తం" అనడమే తనవంతుమాటలు. ఎక్కువసేపు నిటారుగా నుంచోవడం తప్ప మరేమీ పనిలేనందున రాముడు దృష్టి సూరన్న తాతలా వున్న ముసలాయన మీదకి పోయింది. రెండో రంగంలోనే ఆయన నిజంగా సూరన్న తాతేనని గుర్తుపట్టాడు. ఆ తాత కూడా గుర్తుపట్టినట్టే తనవేపు చూస్తున్నాడు. అప్పుడే మసకచీకటిపడుతూంది, లైట్లు వెలిగిస్తున్నారు.

నిజంగా సూరన్న తాతే కనిపించేసరికి రాముడికి భలేసంతోషం వచ్చింది. ఆయన్ని లోగడ గల్లంతుచేసిన సందర్భాలన్నీ గుర్తొచ్చినయ్. కొయ్యకత్తిని మెడముందు అటుయిటూ తిప్పుతూ "మెడకాయ్ కోత్తా"నని తను తాతననే అలవాటును అభినయించాడు. అది చూచిన తలపాగా తాత నవ్వుతూ "ముక్కుకోత్తా గాడిదే" అన్న తన అలవాటును అభినయించాడు. రాముడికి నవ్వాగలేదు. పసితనపు పసందులన్నీ గుర్తొచ్చి ఆనందంతో ఉక్కిరిబిక్కిరై పోయాడు. అతడీ సంబరంలో వుండగా ప్రహ్లాదుడు వచ్చి రాముడిపక్క నుంచున్నాడు. వెనకాల హిరణ్యకశిపుడు "ఈడింభకునికి బుద్ధివచ్చునట్లు శిక్షించుము సైనికా" అంటున్నాడు/ రాముడి దంతాగమనించకుండా నవ్వుతున్నాడు. "మెడకాయికోత్తా"

శ్రీ పోలవరపు శ్రీహరిరావు

...ము కన్నా కోతా" కాళ్ళు యిరగ్గొ... తా" ననేతా తను చెబి ...ంచే అభినయం మహాచేస్తున్నాడు. జనం ...నవ్వుతున్నారు. చివరికి డ్రాయింగ్ మాష్టరొచ్చి బర బరా లాక్కుపోయి ...సీబొండలాగుంది.. యాక్షన్ లేకుండా ...నవ్వేమిట్రా వుంకా" అని గద్దించాడు.

రాముడు చిక్కి మొఖం వేశాడు. డ్రాయింగుమాష్టరు "నువ్వుపనికిరావురా ...రిధవా" అంటూ ఆ దుస్తులన్నీ తీసి మరో పిల్లాడికి వేసి, రాముణ్ణి "ఫో" మన్నాడు. ఎంతకాలంనుంచో తను వేషం వెయ్యాలని వుబలాటపడి; నాన్న నడిగి రూపాయి తెచ్చి ఆరోగ్యవారానికి చందాయిచ్చి; యీ వేషం సంపాయించుకుంటే యిట్లా పనికి రాకుండా పోయిందేమా, నలుగుర్లోనూ నవ్వులపాలై పోయానేమా; ఇది వింటే నాన్న ఎట్లా కొడతాడో నను కుంటూ భయపడవలసింది రాముడు. కాని వాడికా ఆలోచనలే లేవు. "పాడుసిపాయి వేషం పీడావదిలింది" అనుకున్నట్లుఎంతో ఆనందంతో గంతులేస్తూ సూరన్న తాత కూచ్చున్న దగ్గరకు పరుగెత్తాడు. ఆ బెంచీ మీద కూచ్చున్న వాళ్ళని చూచేసరికి రాముడు దిగాలుపడిపోయాడు. వాళ్ళ మధ్య ఆ తాతలేడు. చుట్టూ చూచాడు. పూల చెట్ల మధ్యగా సూరన్న తాతవెళ్ళిపోతున్నాడు - వంగి వంగి నడుస్తూ.

రాముడు గంతుకుంటూ వెళ్ళాడు. సూరన్న తాతగేటు దాటి డొంక వెంటే నడుస్తున్నాడు. రాముడు ఒక్కపరుగున వెళ్ళి ఆయన గోచిపట్టుకుని "దొరికావులే దొంగా" అన్నాడు. ఆయన వెనక్కితిరిగి రాముణ్ణి రెండు చేతులా పట్టుకుని మొఖంలో మొఖం పెట్టి "నిజంగా నా బాబూ" అన్నాడు. రాముడేదో సమాధానం యివ్వబోగా, వినకుండానే అతని నోరును ముద్దెట్టుకున్నాడు అక్కడే చదికిలబడి. రాముడు పూసుకున్న రంగు మూతినిండా అంటుకుందని కూడా ఆయన గుర్తించలేదు. రాముడు సూరన్న తాత బుగ్గలకి తన బుగ్గల్ని రాస్తూంటే - వెచ్చని నీళ్ళు తగిలాయ్. అదేమిటా అని రాముడు తాత ముఖంలోకి చూచాడు. తాత కళ్ళవెంట నీళ్ళు జలజలా కారుతున్నాయ్. తన చేత్తో తుడుస్తూ "నాముఖం రంగు నీకంటుకుందా తాతా! కడుక్కోటం మర్చిపోయాన్తాతా! నలకలు పొయ్యేట్లు తుడవా తాతా" అని అడిగాడు.

తాతగొంతు గుడగుడలాడింది. గుటక మింగి "తూత్తానాబాబూ-తూనాన్నే-తూడు" అన్నాడు ఆయన. రాముడు తాత తలని రెండు చేతుల్లో పట్టుకుని అకంట్లోనూ, యీకంట్లోనూ గాలిపూది "పోయిందా తాతా" అన్నాడు. తాత తలగుడ్డ చెంగుతో కళ్ళు తుడుకుంటూ "పోయింది బాబూ" అని లేచాడు. ఆ తాత యిదివరకు ఎంతో నవ్వుతూ మాట్లాడేవాడు. ఇప్పుడిలా వణుకుతున్నాడెందుకా అని రాముడాలోచించ బోయాడు. సూరన్న తాత తలగుడ్డవిప్పి ఒక కొంగునవున్న మూట విప్పదీశాడు. ఖర్జూరకాయల పొట్లం తీసి రాముడికిచ్చాడు. రాముడు రెండుకాయలు నోట్లో వేసుకుని "నానారోజు అయింది తాతా ఖర్జూరకాయలుతినీ!" అంటూ నములుతున్నాడు. తాత మళ్లీ తలగుడ్డ చుట్టుకుని నడక సాగించాడు.

రాముడు ఖర్జూరకాయల రుచిలో ఆయన వెంటే నడుస్తున్నాడు. తాత మెల్లగా నడుస్తూనే మనవణ్ణియింతింత



కళ్ళు తేసుకుని చూస్తున్నాడు. వెన్నెల్లో డొంకంతా దూది పరుపులావుంది. రాముడు తాతచేతిని పట్టుకుని కాస్సేపూ; వదిలి అటూ ఇటూ పరుగెత్తుతూ కాస్సేపూ వెంటవెళుతున్నాడు. బారుగా పడుతున్న తాతనీడను పరుగెత్తి తంతూ "నిన్ను తంతున్నా తాతా" అంటూంటే, ఆయన "తన్ను బాబూ-తన్ను" అంటూ చకచకా నడిచి, తన నీడను తప్పిస్తున్నాడు. రాముడు మరీ హుషారుగా ఆనీడను వెంటాడి తంతున్నాడు. తాతనీడనటూ యిటూ తొలగించి కవ్విస్తూ నవ్వుకుంటూ మనవణ్ణి హెచ్చరిస్తున్నాడు. అప్పుడు ఆ యిద్దరిమధ్యా అరవైయేళ్ల తేడావున్నదని ఎవరూ అనుకోలేరు-ఆ యిద్దరినవ్వుల్లోనూ, ఆట నానందించడంలోనూ ఏమీ తేడా లేదు.




రైలుగేటు దగ్గర కొచ్చేసరికి తాత రాముడిచెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. రాముడు గుంజుకుంటూ "వదుల్తాతా... నిన్ను తన్నాలి...వదలమంటే" అంటున్నాడు. తాత "ఈ గేటుదాటనీ బాబూ-తర్వాత్తందూగాని" అంటూ అటూ యిటూ పారజూచి, ఏ రైలూ కనుచూపు మేరలో లేదని తెలిసింతర్వాత గేటు దాటాడు మనవడితో. తర్వాత తను చెయ్యివదిలినా రాముడు తన చేతిని వదలడంలేదు. అటూ యిటూ వున్న సర్వీచెట్లనీడలు డొంకను కమ్మేశాయ్. రాముడు "ఇవెక్కడికి తాతా ?" అని అడిగాడు. తాత "కార్లరోడ్డుకి బాబూ...పొద్దుపోయిందిగాని — యిక మీయింటికి వెళతావా?" అని అడిగాడు. రాముడు "నువ్వుకూడారా తాతా-నాకుభయం అంటే -" ఎవరితోనన్నా పంపుతాలే-నువ్వెళ్లు బాబూ... నేను కారెక్కి వెళ్ళాలి" అన్నాడు తాత. రాముడు తలయెత్తి చూస్తూ—"ఎక్కడికెళ్తావ్ తాతా ?" అని అడిగాడు. తాతగొంతు చేత్తో సవరించుకుని "దేవుడు దగ్గరికి నాయనా" అన్నాడు. రాముడు "అమ్మ దొంగా...అన్నీ వుట్టివే...మీ వూరుకా తాతా ?" అని నిలవదీసినట్లు అడిగాడు.

తాత "మావూరు యిక వెళ్లన్నాయనా ...నీకు తెలవదు...ఇక వెళ్తావా యింటికి" అని అడిగాడు. రాముడు "ఉహు. నే వెళ్లను...నువ్వు కూడా రావాలి అంతే-" అని అలిగినట్లు చిందులు వేశాడు. తాత "మా బాబే...నా మీద నీ కెంత ప్రేమా" అంటూ ఎత్తుకుని వళ్లంతా సవరదీస్తూ కంకరరోడ్డెక్కాడు. గానుగచెట్టు కిందకు వెళ్లి "కూచ్చుందాం బాబూ" అన్నాడు.

తాతా మనవడూ రోడ్డుపక్కనే కూచ్చున్నారు. తెల్లనిరాళ్లు ఏరుతున్న తాతని రాముడెగాదిగా చూచాడు. తాత వుషారుగా లేడని దగ్గరకెళ్లి "మా యింటి కెళ్దాంతాతా" అని మారాం చేశాడు. తాత అతన్ని వళ్ళో కూచోబెట్టుకుని "నేవస్తే మీ వెంకన్న తాతా, మీ నాన్నా వూరుకోరుబాబూ..." తల నిమురుతూ. రాముడు "ఎందుకూరుకోరేం? నే చెబుతారాతాతా" అని చెయి పుచ్చుకున్నాడు. తాత నవ్వేడు. ఎంతో బిగ్గరగా నవ్వేడు. నవ్వు దగ్గుగా మారింది. ఖళోల్ ఖళోల్ మని దగ్గుతూంటే రాముడికి భయంవేసింది. అమ్మ తనకు చేసినట్లుగా తను తాత వీపూ, గొంతూ నిమిరాడు; తలమీద అరిచేత్తో రాశాడు. తాతకు దగ్గు తగ్గుతూంది. తాత తనని మెడమీదకు పడుకోబెట్టుకున్నాడు. తను చేత్తో తాత ముఖం సవరదీశాడు. చేతికి వెచ్చని నీళ్ళు తగిలాయ్. భుజంమీంచి లేచి తన చొక్కా అంచుతో తాతకళ్ళు తుడిచాడు.

తాత రాముణ్ణి సవరదీస్తూ గుటకలు వేశాడు. "మంచినీళ్లెక్కడుంటాయి బాబూ" అని అడిగితే రాముడు "నే తెస్తా తాతా" అని ప్రక్కనున్న అరుమల్లోకి పరుగెత్తాడు. అక్కడుండే కాపలా గంగణ్ణి అడిగి చెంబుతో నీళ్లుతెచ్చి తాతకు తాగించాడు. తను చెంబిచ్చి తిరిగిరాగానే తాత బొడ్లోని ఒకగుడ్డ సంచిలోంచి ఎన్నో మడతలు పెట్టిన కాయితంతీసి" ఇది మీ అమ్మకియ్యి బాబూ" అంటూ మళ్లా సంచిలో బెట్టి మూతికట్టి తన జేబులో పెట్టాడు.

రాముడు తాతవళ్లో కూచ్చుని "అమ్మనీ, నన్నూ మీ యింటికి తీసుకెళ్ళవా తాతా" అని అడిగాడు. తాత తలగుడ్డ చెంగుతో ముఖం తుడుచుకుంటూ "మీ నాన్న నడుగు...ఎప్పుడు పంపుతాడో...నే మళ్లావచ్చి తీసుకెళతా"నన్నాడు. రాముడికనేమీ అనలేక తాత వేళ్లల్లో తనవేళ్లు దూర్చి ఆడుకుంటున్నాడు.

తాత తన జుట్టును ముద్దెట్టుకుంటూ "మీ అమ్మ బాగుందా బాబూ" అని అడిగితే-రాముడు "ఓ" అన్నాడు.

"మరి...మీ చెల్లెలు నడుస్తూందా ?"

"ఆ! బుల్లిబుల్లి మాటలు కూడా చెబుతోంది తాతా...నన్ను అన్న అనదు-అక్క అంటుంది"

"అట్టాగా ?...దాని పేరేమిటీ ?"

"శాంత...నానమ్మ పేరట తాతా"

"మరి మీ అమ్మేమని పిలుస్తుందీ చెల్లెల్ని"

"అమ్మ అంటుంది. ఒక్కొక్కసారి సుభా అంటుంది."

"మీ అమ్మమ్మ పేరేమిటో నీకు తెలుసా బాబూ ?"

"సుబ్బమ్మకా తాతా ?-నాకు గుర్తే-చచ్చిపోతేనూ ఏడిచాగా తాతా ?"

"అవున్నాయనా...అదుష్టమంతురాలు"

"తాతా !...మరేం...మరేం...అమ్మమ్మ మురుగులు అమ్మేమో పెట్టెలో దాశిందీ... నాన్నేమో ఆటితో ఏవో చేస్తాను యిమ్మన్నాడూ...అమ్మేమో యివ్వనందీ... నాన్నేమో అమ్మని కొట్టేడూ... తాతోయ్, అమ్మ నన్ను కావిలిచ్చుకుని ఎంతేడిశిందనుకున్నావ్...మరేం-అమ్మ వీపుమీద వాతలు వాశినియ్ తాతా "అని చెబుతూనే రాముడు ఏడ్చాడు. తాత "మా అమ్మే... సీతామ్మవారిలా ఎన్నికష్టాలే నీకు..."

అంటూ గావురుమన్నాడు. రాముడు కన్నీళ్లు తుడుచుకుని "ఏంటి తాతా?" అని అడిగితే - "ఏంలేదు బాబూ...మీ నాన్న అమ్మని కొట్టకూడదంటానని నన్ను మీ యింటికి రానివ్వటంలేదు బాబూ" అని చెప్పాడు. రాముడు "మరి...నేను మా నాన్నని ఆపాను తాతా...అమ్మని కొట్టద్దన్నాను...నన్నేమీ అనలేదేం? బొజ్జ తాతమాత్రం...ఏడిశావులే అన్నాడే నన్నూ" అంటూ చెప్పాడు. తాత - "ఆ బొజ్జవెంకన్నేరా బాబూ - మీ కాపరాన్నిట్లా తగలెట్టింది" అన్నాడేగాని అదేమిటో రాముడు కర్థంకాలేదు. "నువ్వొచ్చి మా బొజ్జతాతని చంపెయ్యరాదెంటే తాతా" అని అడిగాడు. "ఆడు అమ్మనీ, నన్నూ జడిపిత్తాడే" అని కూడా ఫిర్యాదు చేశాడు. సూరన్నతాత "నే కాదుగాని - నువ్వే పెద్దయ్యాక ఆ బొజ్జ పగలగొట్టు...ఏం?" అని బోధించాడు. రాముడు "ఓ..నాన్నంతయ్యాక చంపేత్తా" అన్నాడు...

* * *

కార్లటూ యిటూ వెళుతూనే వున్నాయ్. తాతా మనవళ్ళకు వాటిమీదే లేదు. పదిగంటలవుతూంది. ఓ కారాగింది. ఎవరో దిగారు. అందులో ఒకరు రాముణ్ణి గుర్తుపట్టారు. "ఏరా ఇక్కడున్నావేం యింతపొద్దోయినా?" అని అడిగాడు. తాత "నా వెంటవచ్చాడు గానీ...మీరు తీసుకెళ్లండి బాబూ" అని అడిగాడు. ఆ పెద్దమనిషి రాముణ్ణి రమ్మన్నాడు. వాడు "కాసేపుండి ఎల్తా తాతా" అని యింకా డొక్కల్లోకి జరిగాడు.

కాస్సేపటికి రాముడు "ఈపూరెందుకొచ్చావ్ తాతా?" అని అడిగాడు.

"నిన్ను ఆఖరుసారి చూచి పోదామని బాబూ"

"మరి నాతో మాట్లాడకుండానే వెళ్లిపోతున్నావేం దొంగలాగా తాతా?"

"నామూలాన నువ్వు నీవేషం సరిగ్గా వెయ్యలేదు. మరి పంతులు కొడతాడేమో ననుకున్నా(నా...ఏమన్నా అన్నాడా పంతులూ?"

"నే వేషం వెయ్యలేనన్నాడు తాతా...యింకేమీఅనలా...అసలా వేషంపాడుది తాతా.. కొయ్యలాగా నుంచోవాలీ"

"అవును బాబూ...నువ్వు రాజువేషం వెయ్యాలసలు."

"మరివచ్చే ఏడువేస్తాగాని చూస్తాకి వస్తావా తాతా"

"ఊ...ఏమో..."

"ఊ...నువ్వు రాపోతే నే వెయ్యనేయ్యను"




ఫోనిక్సు పంకాలు

(A. C. & D. C.)

సోల్ ఏజెంట్లు:
RM. S. & Co., Ltd, 16, Broadway, MADRAS-1.
విశాఖపట్టణం అండ్ తూర్పుగోదావరి జిల్లాలకు ఏజెంట్లు:-
మెస్సర్సు మాక్‌డవెల్ అండ్ కంపెనీ లిమిటెడ్,
విశాఖపట్టణం.

స్టాకిస్టులు కావలెను

శ్రీ అంబాళ్

ఆఫీసరస్ నస్యము




1 తులము టిన్నులలో అన్నిచోట్ల దొరుకును.

శ్రీ అంబాళ్ అండు కంపెనీ,

తపాలు పెట్టె నెం. 8. మదరాసు.

"ఆ! అట్లాగే వస్తాలే బాబూ"...

రావాలి తాతోయ్... లేపోత్తంతా... అంతే" అన్నాడు రాముడు హుషారుగా.., తాత నవ్వుకున్నాడు.

పొద్దు పోతూంది... కారు లికరావు కూడాను. అయినా తాత ఏ కారునూ ఆపప్రయత్నించలేదు. "రాముడు" కారాపవేం తాతా" అని అడిగితే... తాత అప్పుడే నిద్రలేచినట్టు గాభరాపడ్డాడు. "నేనా వచ్చేకారొక్క వెళ్తాగాని యిక నువ్వు యింటికెళ్ళు బాబూ! అమ్మతో నే వెళ్ళిపోయానని చెప్పు. చెల్లెల్ని నాపేరుచెప్పి ముద్దుపెట్టుకో...ఏం?" అని రాముణ్ణి అడిగాడు.

రాముడు "సరే తాతా" అన్నాడు. తాత "మరి సెలవిచ్చావనిగాని, యిట్లామాట్లాడావనిగానీ మీనాన్నకీ, తాతకీ చెప్పకూకు...ఏం" అని బతిమాలాడు. రాముడు దానికీ ఒప్పుకున్నాడు. ఒక పాలేరు గడ్డి మోపుతో వూళ్ళోకి వెళుతుంటేవాడికి రాముణ్ణిచ్చి, యింటివద్ద దింపమని చెప్పి మనవణ్ణిపంపేశాడు తాత.

తను తాత సెన్నో ముద్దులు పెట్టుకుని "వెళ్తాను తాతా...మళ్ళీ ఆరోగ్య వారాలప్పుడు రావాలి తాతాయ్...రాజువేషం వేస్తాగా.. రా వా వా లి తా తో య్" అంటూనే రైలుగేటుదాటి యింటికి వెళ్ళిపోయాడు.

* * *

రాముడు చరచరా యింట్లోకి పరుగెత్తాడు. బొజ్జతాతా, నాన్నా అన్నం తింటున్నారు. అమ్మ మజ్జిగ వడ్డిస్తూంది. అమ్మను చూడగానే ఖర్జూరకాయలిచ్చి, తాతసంగతులు చెబుదామనుకున్న రాముడు యీ గది చూడగానే కొంపలమ్మ్యరు పప్పులు తెచ్చుకున్నట్టు ఫీలయ్యాడు. గుమ్మంలోని కాలు వెనక్కి తీసుకుని వెనక్కి వెళ్ళబోయాడు. వెంకన్న తాత గ్రురుద్రెన్ని "ఇప్పుడుదాకా ఎక్కడ పెత్తనాలెడితొచ్చావ్ రా?" అని కేకేశాడు. రాముడు కేదో గొంతు పట్టినట్లయింది. మాట్లాడలేదు...నాన్నా "చెప్పవేంరా?" అన్నాడు కోపంగా. రాముడు కళ్ళలో నీళ్లు తిరిగాయ్.

అమ్మ ఎగాదిగా చూచి "ముఖం రంగన్నా కడుక్కోలేదు...నాటకాలవీ కాదటండీ ... ఆటలతో అలస్యమయింది కావల్నులెండి" అని సర్దిచెప్పింది. "అదే చెప్పరాదట్రా నన్నాకీ" అన్నాడు బొజ్జతాత. "ఏంప్రయి జొచ్చిందిరా" అన్నాడు తండ్రి. రాముడు కా బహుమతుః సంగతే గుర్తులేదు. తనకు కనీసం వెన్నెలన్నా వచ్చివుండాలి... తనేమో చివరికంటా సభలో లేడయ్యె...ఏం చెప్పాలో తెలీక; యికనాన్న, తాతా కొడతారేమోననే దిగులుతో తెల్లబోయాడు రాముడు.

అమ్మ మెల్లగా దగ్గరకొచ్చి జేబు తడిమింది. ఖర్జూరకాయలుతీసి "ఇవిచ్చారా నాయనా" అంది. చేసేదిలేక తలూపాడు రాముడు. జేబులోని సంచీతీసి "ఇదేమిటి బాబూ" అంది అమ్మ...రాముడు ఆ సంచీ లాక్కొనిబైటికిపారిపోయాడు–అదితండ్రీ, తాతలుచూస్తే సూరన్న తాత రహస్యం బయటపడుతుందేమోననేభయంతో.

అమ్మ "ఏదో బహుమతి కావాల్నండీ...దాచుకుంటున్నాడూ" అంది. తండ్రీ, తాతా తృప్తిగా పక్కలమీద పడుకున్నాక రాముడు దొడ్డిదోవనే యింట్లోకి వెళ్ళాడు. తల్లి అన్నంతినమంటే "ఆకలిలేదే అమ్మా"అని వెళ్ళి చెల్లెల్ని ముద్దుపెట్టుకుంటూ, దాని చెవిలో సూరన్నతాత ముద్దులు చెల్లీ"అని చెప్పాడు.

అమ్మ అన్నంతిని, వంటిల్లుసర్ది తనకో గ్లాసుడు పాలు తెచ్చి యిచ్చింది. అవి తాగి తను పడుకున్నాడు. సూరన్నతాత యిచ్చిన సంచీ జేబులో పెట్టుకుని దాన్ని చేత్తో అదిమిపట్టుకుని నిద్రోయాడు తెల్లవారుఝామున లేవగానే అమ్మ చలికట్టు కట్టి చదువుకోమని పుస్తకంయిచ్చి మజ్జిగ చేస్తూండగా ఆ సంచీతీసి యిచ్చాడు. సూరన్నతాత సంగతులన్నీ చెప్పాడు. అమ్మ ఆ సంచిలోని కాయితం చదువుకుని, రాముణ్ణి కౌలించుకుని కన్నీళ్ళు పెట్టుకుంటూంటే రాముడూ ఏడ్చాడు గాని ఎందుకో అర్థంకాలేదు.

అప్పుడూ, ఆ తర్వాతా తల్లి ఏడుస్తూనే వుంది. పొద్దుపొడవగానే రాముడుకు చద్దన్నంపెట్టి, ఆతాత ఎలావున్నాడనీ, ఏమేమన్నాడనీ మళ్ళీ మళ్ళీ అడిగి చెప్పించుకుంటూంది. అప్పుడే ఆకుమళ్ళ కాపలాగంగయ్యవచ్చి, అరుగు మీద కూర్చున్న బొజ్జతాతతో "మీ వియ్యంకుడుగారు కొల్లాగేచెట్టు దగ్గర చచ్చిపడి వున్నారండీ" అని చెప్పాడు. ఆ వెంకన్న తాత "ఆ దొంగ ముండాకొడుకు మాక ప్రదిష్ట తేవడానికొక్కపోతే—అక్కడే చావాలీ, యింటి కఘోరించకూడదు" అనడం రాముడు వినలేదు. "నాన్నా" అని కేకేసి గోడకు జేరబడిన తల్లినికూడా గమనించలేదు. అన్నం వదిలి ఎంగిలిచేత్తోనే రోడ్డుకు పరుగెత్తాడు. తాత పెదిమలకూ, బుగ్గలకూ అంటుకున్న పౌడరు అలానే వుంది. ★

వైబ్రో
గర్భాశయ రోగనివారిణి
సర్వ గర్భాశయ వ్యాధులను పూర్తిగా పోగొట్టి, సత్సంతానమును కలుగ జేయుటలో మా వైబ్రో మిక్కిలి ఘనతవహించినది. అన్ని షాపులలో దొరకును.
రు 2-8-0
KL
కృష్ణా లేబరేటరీ
★ బెజవాడ ★

32 సంవత్సరముల అనుభవముగల రెడ్డి అండ్ కో., వారి (రిజిష్టర్డు)
కుష్టు, బొల్లి, సుఖ రోగోది చికిత్సలకు నేడే సంప్రదించండి.
నకలుమందులు చూసి మోస పోకుడు.
అన్నిభాషలలో కేట్లాగు ఉచితము.
హెడ్ ఆఫీస్: రెడ్డి అండ్ కో., గోపాలపురం. (తూర్పుగోదావరి)
బ్రాంచిలు:- నెల్లూరు, బెజవాడ, రాజమండ్రి, సికింద్రాబాద్, విశాఖపట్నం, బరహంపురం, మొదలగు పట్టణములలో.

గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వర ఫార్మసీ, రాజమండ్రి.